# ఋణానుబంధం

యామినీ సరస్వతి

**"ఇందుమూలముగా** సమస్త గ్రామ ప్రజలకుతెలియజేయడమేమనగారేపుసాయంకాలం 3 గంటలకు గ్రామ చావడి వద్ద రెడ్డి, కరణం, ప్రెసిడెంటు, పెద్దమనుషుల సమక్షంలో నాదెళ్ళ రంగయ్యగారి ఇల్లు, పొలము, వామిదొడ్డి యావత్తూ అప్పుల క్రింద శ్రీ కోర్టువారిచే బహిరంగ వేలము వేయబడును. వేలములో పాల్గొన దలచినవారందరూ హాజరుకావచ్చును. వేలము పాటలో పాటపాడిన వారు వెంటనే మొత్తం సొమ్ములో నాలుగవ వంతు చెల్లించవలెను. మిగతా సొమ్ము ఒకనెల రోజుల లోగా పూర్తిగా చెల్లించి రిజిస్టరు చేయించుకొనవలెను. సదరు ఆస్తిని కోర్టువారే స్వాధీన పరుస్తారు."

పిడుగులాంటి కంఠంతో తలారి కేకలువేస్తూ చెబుతున్నాడు. అది పూర్తికాగానే తిరిగి ఉరుముల వంటి శబ్దంతో తప్పెట మ్రోత. వాళ్ళ వెనుక ఆనందంగా ఏదో తెలియని ఉత్సాహంతో కేకలు వేస్తూ వెళుతున్న పిల్లలు. ఇళ్ళ ముందు నుంచుని విని నిట్టూర్చే పల్లె జనం. వాళ్ళలో కొందరు రంగయ్యకి పట్టిన దుర్దశకి విచారిస్తే, మరికొందరు సంతోషిస్తున్నారు.

వూరు వూరంతా ఆ దండోరాతో అట్టుడికినట్టు ఉడికిపోతున్నది. ఆ వూర్లో ఎన్నో వేలం పాటలు జరిగాయి. జముఖానాలు, దుప్పట్లు, దోమతెరలు, పంచలు, టవళ్ళు—బేళ్ళతో తీసుకుని వచ్చి పెట్రోమాక్స్ లైట్ల వెలుతుర్లో వేలంవేసి, అప్పు ఇచ్చి తిరిగి మాసూలు కాలంలో వచ్చి అప్పుని వసూలు చేసుకుని వెళతారు. పళ్ళ సీజన్లో మామిడిపళ్ళు అలాగే వేలంలో అమ్ముతారు. గ్రామ పుల్లరి వేలం పాడతారు. గేటు వేలం పాడతారు. ఆ మధ్య ఎలక్షన్సు వచ్చినప్పుడు సర్పంచ్ గిరీ వేలం పాటలో కొన్నాడు శివరామిరెడ్డి.

కానీ, ఒక మోతుబరీ ఆసామీ అప్పులు తీర్చలేక కోర్టుకెక్కి అతని ఆస్తి ఇలా బహిరంగంగా వేలం వేయబడటం మాత్రం ఆ గ్రామ చరిత్రలో ఇదే ప్రథమం.

నిజానికి రంగయ్య వంశం చాలా ఉన్నతమైంది. ఆస్తిలో, ఐశ్వర్యంలోనే కాదు పరువు మర్యాదల్లో కూడా పేరు పొందిందే. అతని తాత మోతుబరి. అతని తండ్రి ప్రెసిడెంటు. అతనూ కొన్నేళ్ళు ప్రెసిడెంటు గిరీ చెలాయించాడు.

కానయితే ఈ మూడుతరాల్లోనూ అయివేజెంత, ఖర్చెంత అన్న లెఖ్ఖ చూసుకున్న పాపాన పోయిన వారెవరూ లేరు. ఎలా వస్తుందో, ఎంత వస్తుందో అన్న విచారం లేకుండా ఖర్చు చేశారు అందరూ. ఇదిగో ఇప్పుడు ఇలా రంగయ్య కర్మ కాలింది!

వూరు వూరంతా తిరిగి దండోరా ఆవీధికివచ్చింది. వీధి మధ్యలో రాజాలా నుంచున్నట్టుగా ఉంటుంది ఆ ఇల్లు. చుట్టూ పూర్వపు రోజుల్లో కట్టిన కాంపౌండ్ గోడ. దానికి రంగయ్య పదవి వెలిగించిన రోజుల్లో సిమెంటు పూత వేయించాడు. ఇటీవలి కాలంలో సున్నం కూడా వేయించలేదు మళ్ళీ. దాదాపు అర ఎకరం విస్తీర్ణంలో ఉంది ఆ ఇల్లు. లంకంత కొంప. పది పెద్ద గదులు, ఆరు చిన్న గదులు, మూడు వసారాలు, రెండు మేడమీది గదులు ... అచ్చు ఆ రోజుల్లో చిన రామయ్యగారి గంపెడంత సంతానానికి తగినట్టుగా కట్టించుకున్నా రాయన.

"ఇందుమూలంగా ..."

ఉరుములాంటి కంఠం, పిడుగుశబ్దంతోతప్పెట..

అవి తన గుండె మీథనే మోగుతున్నట్టుగా ఫీలయ్యాడు రంగయ్య. ఒక్కరూ మేడమీద గదిలో కూర్చున్నాడు. అతను విన్నటినుంచి మేడదిగి రాలేదు. బీడీ మీద బీడీ కాలుస్తూ, గంట గంటకి భార్య పంపే కబురుతోపాటే వచ్చే కాఫీ తాగుతూ ఆలోచనల్లో మునిగిపోయాడు.

ఎడతెగని ఆలోచనలు!

ఎంత ఆలోచిస్తేనేం అంతా అయిపోయింది. ఇప్పుడు చేసేది చేయగలిగిందీ ఏమీ లేదు, అనుకున్నాడు మళ్ళీ అలా ఇప్పటికి ఎన్ని పర్యాయాలో అనుకున్నాడు.

కానీ మళ్ళీ ఆలోచించటం మానలేదు.

ఈ వేలాన్ని ఆపటం ఎలా ?

ఏదో అద్భుతం జరిగి వేలం ఆగిపోతే తప్ప—మరో విధంగా వేలం ఆగే ప్రసక్తే లేదు. కానీ మనిషి ఎప్పుడూ అసంభవాలమీదే ఆశపెట్టుకుని ఆశ పెంచుకుంటాడు.

ఏ నిధి, నిక్షేపమో బయట పడకూడదా?

అంతమంది అక్కగార్లు, బావగార్లున్నారు. మేనత్తలు, మేనమామ లున్నారు, బాబాయి లున్నారు. వాళ్ళ కొడుకు లున్నారు. ఎవరో ఒకరు హటాత్తుగా వూడిపడి డబ్బు కట్టేసి వేలాన్ని ఆపకూడదా?

ఆఖరికి — దత్తుపోయిన తన కొడుకు—అమెరికాలో డాక్టరీ గిరీ వెలగబెడుతున్నవాడు కొన్ని డాలర్లు పంపకూడదా!

తన మేనల్లుడు, తన ముద్దుల బిడ్డ మొగుడూ, ఇరాన్లో ఇంజనీరింగ్ కంట్రాక్టరు శివప్రసాద్—వాడయినా పెట్రు డాలర్లు కొన్ని పంపరాదా?

భాగ్యలక్ష్మి లాటరీ ఈ రోజే ఎత్తుతారు. అన్ని వ్యసనాల్లో వ్యసనంగా ఈ లాటరీ టికెట్లు ఈ మధ్య తెగ కొంటున్నాడు. తనకి ఫస్ట్ ప్రయిజు తగలకూడదా?

వీటిలో ఏ ఒక్కటి తగిలినా వేలం' ఆగిపోతుంది. ఉస్సురని నిట్టూర్చాడు రంగయ్య.

"నాన్నా! అమ్మ భోజనానికి రమ్మంటుంది." ఆరుగురు కూతుళ్ళు, నలుగురు కొడుకుల్లో ఆఖరి వాడు శీనయ్య పిలిచాడు.

వాడు తెచ్చిన కాఫీ అందుకుని ఒకగుక్క తాగాడు. సాపిచేదు. విషంలా ఉంది. పోనీ ఇది విషం కాకూడదూ. తను గంటో, అరగంటో యాతన పడి మరణిస్తాడు. అలా గయినా వేలం ఆగుతుంది.

వూహూఁ తన ముద్దుల కొడుకు విషం ఇస్తాడా అందునా భార్య పంపుతుందా? పగటి కల!

తిరిగి కళ్ళు మూసుకున్నాడు రంగయ్య.

శీనయ్య కొద్దిగా దగ్గాడు. వాడికి నిండా పదహారేళ్ళు. జరిగే దేమిటో పూర్తిగా తెలియదు. కానీ వూర్లో వీధి వీధిలో తను పేరు చెప్పి, దండోరా వేస్తున్నారు. ఎందుకో కనుక్కోవాలని ఉంది. తల్లిని అడిగితే కసురుకుని గుడ్లనీరు కక్కుకుంది.

తండ్రయినా చెబుతాడా.

రంగయ్య కళ్ళు తెరిచాడు.

"ఆ దండోరా ఏమిటి, నాన్నా. ఎందుకు మన ఆస్తి, ఇల్లు వేలం వేస్తున్నారు—"

కొడుకు ఆవిధంగా ప్రశ్నించేసరికి రంగయ్య కళ్ళల్లో నీళ్ళుబికి వచ్చాయి. కానీ పసివాడు. బొత్తిగా ప్రపంచం తెలియని వాడు. వాడికి ఈ విషయం చెప్పి ఎందుకు బెంబేలెత్తించాలి.


కొడుక్కి జవాబు చెప్పకుండా కళ్ళు మూసుకున్నాడు. దాంతో శీనయ్య క్రిందికి వెళ్ళిపోయాడు.

తిరిగి ఆలోచనలు.

"రేపు వేలం— రేపు ఈ సరికల్లా అంతా అయిపోతుంది. తను ఆశించినట్టుగా ఆ ఆగిపోదు. బాబాయి సింహయ్య కోరుకున్నట్టుగా ఈ ఇంటిని వేలంలో కొట్టేస్తాడు. ఆయనకి ఎవరూ ఆట్టే పోటీ తగలరు. ఎన్నేళ్ళ నుంచో ఈ ఇంటిని అమ్మేయ్య

ఆయనే అడుగుతున్నాడు. తను వినలేదు, విని పించుకోలేదు. ఆఖరికి ఆయన కోరిక తీరినట్టుగా ఇలా ఇల్లు వేలం పాలవుతోంది.

పొలమూ అంతే! తోటా అంతే! వామిదొడ్డీ అంతే! అంతా దాయాదులకి వెళ్ళిపోతుంది. బహుశా తోట సర్పంచ్ కొంటాడేమో! అతనికి తోటపక్క తోట. తన వాళ్ళు పాట పాడినా అత నొదలండేమో!



తనకేం మిగులుతుంది!

తనూ, తన భార్య, ఆఖరి కొడుకు శీనయ్య రోడ్డుమీద నిలబడతారు. అప్పు తీర్చలేక ఆస్తంతా కోర్టుపరం చేశాడన్న అపవాదు మిగులుతుంది. తల దాచుకునేందుకి కూడా లేకుండా చేశాడనే నింద మిగులుతుంది. చేసుకున్న వారికి చేసుకున్నంత అన్న సామెత మిగులుతుంది.

తన గుండెలో గుబులు మిగులుతుంది!

ఈ రోజు అయిపోయింది— రేపు చీకటిపడితే— ఆ తర్వాత ఎల్లుండి సూర్యోదయాన్ని తను ఈ వూర్లో ఏ ముఖం పెట్టుకు చూడగలడు. కట్టుబట్టలతో ముగ్గురూ ఇల్లు విడిచి వెళ్ళాలి! ఎక్కడికి ఎక్కడికి.

అలా తను బతగ్గలడా

అసలు బతికేదెలా ఏం తిని, ఏం తాగి బతకాలి ఎక్కడ బతకాలి.

ఈ వూర్లో ఉండలేడు.

కాకుల్లా చూపులతో పొడిచే జనం మధ్య, కాకుల్లా మాటలతో పొడిచే జనం మధ్య — తను నివసించలేడు.

వెళ్ళిపోవాలి! తప్పదు. కానీ ఎక్కడికి.

ఏ కూతురు ఆశ్రయం ఇస్తుంది ఏ కొడుకు ఇంత అన్నం పెడతాడు. తాను అందరికీ చెడ్డ అయిపోయాడు. అవును మరి—డబ్బు పోగొట్టుకున్న మనిషి అందరికీ చెడ్డవాడే—

లేచి నుంచున్నాడు ఏదో నిశ్చయానికి వచ్చినట్లు.

మేడమీద రెండు గదులూ అంగుళం అంగుళం పరిశీలనగా చూశాడు. ఈ ఇంటికి, ఈ గోడలకి ఋణం తీరిపోయింది. ఏదో అద్భుతం జరిగితే తప్ప తిరిగి ఈ ఇంట్లో బతకటం కుదర్దు.

ఆ అద్భుతం జరగదు — అది ఖాయం... జరుగుతుందని ఆశించటం తన భ్రమ—తన అవివేకం—

మెల్లిగా మెట్లు దిగి వచ్చాడు. ఒక్కో మెట్టు దిగి వస్తూ ఉంటే కృష్ణపక్షంలో చంద్రుడు ఒక్కో రోజు గడిచి వచ్చినట్టుగా ఉంది. అయిపోయింది — తన బ్రతుక్కి అమావాస్య ఘడియలు వచ్చేశాయి.

హాల్లో అడుగు పెట్టాడు.

ఎదురుగోడకి తాత ఫోటో. పక్కనే తండ్రి ఫోటో. నిమ్మకాయలు నిలబెట్ట గలిగినంత గొప్ప మీసాలతో ఉన్నారు. ఆ ఫోటోలు మద్రాసునుంచి తానే రాయించి తెప్పించారు. అంతకు పూర్వీకుల ఫోటోలు దొరకలేదు. వాళ్ళ పేర్లు తెలుసు. రూపు రేఖలు తెలియవు. అయితేనేం. ఒక్కొక్కరు ఈ పరగణా అంతా ప్రసిద్ధి వహించి బ్రతికారు. రాజాలా పుట్టి, రాజాలా పెరిగి, రాజాలా చనిపోయారు.

తనూ రాజాలా పుట్టాడు. యువరాజులా పెరిగాడు. మహారాజులా బ్రతికాడు. కానీ ఇప్పుడు ఫకీరులా చనిపోతున్నాడు. అదీ తనకీ, వాళ్ళకీ తేడా!

"హమ్మయ్య! దిగి వచ్చారా! నేనే వద్దాం అనుకున్నాను. మీరొచ్చారు. భోజనం చేస్తారా నిన్ననగా పైకి వెళ్ళారు. కాఫీ తప్ప ఇంకేం తీసుకోలేదు.

మీ ముఖం ఎలా పీక్కుపోయిందో చూడండి. కష్టాలొచ్చాయని దిగులుపడితే అవుతుందా దిగులుతో కష్టాలు తీరిపోతాయా? ఎలాగో గుండె ధైర్యం తెచ్చుకోవాలి. బతుకుతో పోరాడాలి. అంతే. మీరే అలా అయిపోతే ఎలా చెప్పండి మా గతేంకావాలి.'' నిన్నటి నుంచి భర్తని చూడని దిగులు జరుగబోయే పరిణామాలపై భయం కలిసి ఆమెని అలా మాటాడించాయి.

ఈ ముప్పై ఏళ్ళ సంసారంలో ఏ నాడూ భర్తతో ఈ విధంగా మాట్లాడి ఎరగదు! ఇప్పు డీ ధైర్యం ఎలా వచ్చిందీ అంటే— ఇబ్బందులు— కష్టాలు తెచ్చి పెట్టిన ధైర్యం.

పార్వతి మాటలకు సమాధానం ఇవ్వలేదు రంగయ్య.

హాలు నంతా మరోసారి కలియ చూశాడు. భార్య వైపు ఆదోలా— అదీ చివరి చూపు అన్నట్టుగా చూశాడు. కదిలాడు. తరవాత ఇంట్లో ప్రతి రాయినీ, బండనీ, వస్తువునీ పలకరిస్తున్నట్టుగా చూశాడు.

లోపల గదులన్నీ దాటి, వంటిల్లు దాటి పూజా మందిరంలో ప్రవేశించాడు. డిమ్‌లైట్ వెలుతుర్లో పూజామందిరం కాంతి తగ్గినట్టుగా అనిపించి; స్విచ్ నొక్కాడు. బార్‌లైట్ వెలగ లేదు. దానికోకి విద్యుత్ వస్తూ పోతూ ఉన్నట్టుగా అది ఆరుతూ, వెలుగుతూ ఉంది.

'నా లాగే దీని జీవితమూ కొడి గట్టింది' అనుకున్నాడు.

'ఇంకా సంధ్యా దీపం వెలిగించలేదేం?' స్వామి వారి మందసం వైపు చూసి అనుకున్నాడు 'పార్వతి తన దిగులుతో దేవుళ్ళ సంగతి పట్టించుకోలేదు కాబోలు. అవును తాము బాగుంటేనే కదా ఈ దేవుళ్ళకి పూజలు, పురస్కారాలు, నిత్య నైవేద్యాలు, ధూపదీపాలు తాము హరించుక పోతారు కర్పూరంలా. స్వామికి భోగం తక్కువైంది.

అంత విషాదంలోనూ అతనికి నవ్వొచ్చింది తన కొచ్చిన మరో వూహకి. 'ఈ మనుషులేం పిచ్చి వాళ్ళు? దేవుడిని అదిమ్మని, ఇదిమ్మని అడుగుతారు. ఆ పదవి, ఈ పదవి, ఐశ్వర్యం కావాలని ప్రార్థిస్తారు. అవి నెరవేరితే ఎన్నెన్నో భోగాలు చేయిస్తామని మొక్కుకుంటారు.

కానీ నిజంగా అలా ప్రార్థించటం అవసర మా? ఆ దేవుడే తనకి మహా రాజవైభోగంగా అర్చనలు సాగేందుకి ఈ మనుషులకి ఐశ్వర్యం ఇవ్వాలి. అది అతని విధి.''

చప్పున అతనికి భయం వేసింది. తను నాస్తికుడు అవుతున్నాడా? అందుకే భగవంతుడు అన్నీ తన నుంచి లాక్కున్నాడా? అఖరికి ప్రాణం— అతని వూహ అక్కడే ఆగిపోయింది.

గదినుంచి బయటికి వచ్చాడు.

పెద్ద గుమ్మం తలుపుని చేతులారా స్పృశించాడు. పెరట్లోకి ప్రవేశించాడు. జామ, నిమ్మ, నారింజ, కొబ్బరి, బాదంచెట్లు—పెరడు నంతా తోటని చేశారు. పార్వతి, శీనయ్య కలిసి బావికింద కష్టపడి కూరపాదులు పెంచారు. పొట్ల, కాకర, దొండ, గుమ్మడి, తామర తీగల్లా అల్లుకు పోయాయి. బెండ మడి విపరీతంగా కాస్తుంది. తను కూరగాయల్ని అమ్మమన్నాడు. పార్వతి వింతగా చూసింది. ఈ ఇంట్లో కూరగాయల్ని దానం ఇవ్వటం తప్ప అమ్ముకున్నారా ఎవరయినా అన్నట్టుగా చూసింది.

తనకే కాదు— తన భార్యకీ లౌక్యం తెలియదు.

మసీదు మైకు అల్లాహో అక్బర్ అంటూ వినదించింది.

ఎనిమిది అనుకునేలోగానే మునిసిపల్ సైరన్ మోగింది.

గేటు దాటబోతూ దాన్ని తడిమాడు. ఈ గేటుని తనే మద్రాసులో డిజైన్ చేయించి వేయించాడు. అంతకు పూర్వం చెక్క గేటు. తన తాత కాలంలో గేట్ లేదు.

ఆయన గొప్పగా అనేవారు— ''ఈ ఇంటి తలుపులు అతిథి అభ్యాగతులకి, అన్నార్తులకి ఎల్లప్పుడూ తెరిచి ఉంటాయి. అందుకే నేను గేట్ పెట్టించ లేదు'' అని.

తాత గుర్తుకి రాగానే ఎదలో ఏదో గర్వం.

ఏ పదవీ లేకుండానే ఆయన గ్రామాన్ని శాసించారు. ప్చ్! ఆ రోజులే వేరు.




"కర్కశంగా, గరుకుగాఉండే పళ్ళపొడులు మీ పళ్ళకు, చిగుళ్ళకు హానికలిగించవచ్చు..."

TP.G.30 TL

**కోల్గేట్ టూత్ పౌడర్‌తో మీ చిగుళ్ళను, చెడుశ్వాసను కూడా అరికట్టండి, పళ్ళను కాపాడుకోండి.**

కోల్గేట్ టూత్ పౌడర్ ఎంతో మెత్తగా ఉండే తెల్లని పౌడర్. అది అతి మృదువుగా మీ చిగుళ్ళను తోముతుంది. అంతేగాకుండా దానిలో ఉండే సున్నితమైన మెరుగునిచ్చే పదార్థం మీ పళ్ళ మీది పాచిపొరలను తొలగిస్తుంది. మీ పళ్ళను శుభ్రపరచి తెల్లగా చేస్తుంది. కోల్గేట్‌లోని పుష్కలమైన నురుగునిచ్చే చర్య పళ్ళ సందులలోనికి చొచ్చుకుపోయి చెడు వాసనను దంతక్షయకారకములైన సూక్ష్మ క్రిములను తొలగిస్తుంది.

మీ కుటుంబానికి కోల్గేట్ టూత్ పౌడర్‌తో అధునాతనమైన తీరులో దంతరక్షణ సమకూర్చండి. దానియొక్క చల్లని, పిప్పర్‌మెంట్ రుచిని వారంతా మెచ్చుకుంటారు.



గేటు దాటి ఒకసారి వెనక్కి తిరిగి చూశాడు. అమావాస్య రోజులు కాబోలు. చుక్కలు మిలమిల లాడుతూ ఉంటే నీలి ఆకాశం తన పందిరిలో మల్లెలు విరియించినట్లుగా ఉంది. ముఖ ద్వారం లైటు వెలగటం లేదు కాబోలు వెలిగించడం లేదు. ఇల్లంతా అర చీకటిలో ఉన్నట్టుగా ఉంది.

ఈ ఇంటిని, ఈ కుటుంబాన్ని చీకటి కమ్మేసింది అనుకున్నాడు.

గుండె బరువై పోయింది.

రెండు కన్నీటి బొట్లు రాలాయి. నిశ్శబ్దంగా కదిలాడు. రోడ్డెక్కగానే వీధి కుక్క బొంయ్‌మంది. మళ్ళీ కుంయ్‌మంది.

● ● ● ●

రాత్రి దాదాపు తొమ్మిది గంటల సమయం. తన తోట ముందు నించున్నాడు రంగయ్య. ఇన్నేళ్ళ జీవితంలోనూ శరత్తులో విహారయాత్రలకి, వన భోజనాలకి తప్ప ఏ నాడూ తోట ముఖం చూళ్ళేదు పదెకరాల తోట! చుట్టు పట్ల చాలా ప్రసిద్ధి. ఆ బావిలో నీళ్ళు కొబ్బరి బోండాం నీళ్ళలా ఉంటా యని అంతా పొగుడుతారు.

తన తండ్రి కాలంలో తోట తిరిగి సాటారు. ఆయన ఒక్కో చెట్టూని ఏరి కోరి తెచ్చి, నాటి, పిల్లల్ని పెంచినట్లుగా పెంచారు. ఆయనకి ఈ తోట అంటే ఎంతో ప్రాణం. అందుకే ఇది తన భాగానికి ఇచ్చారు.

ఆయన ఎన్నో ఇచ్చారు.

వంశపారంపర్యంగా వచ్చే పూజా సామగ్రి అంతా తనకే వచ్చింది. వెండి, బంగారు పాలు, నగలు అన్నీ తనీ అమ్ముకున్నాడు. తను దేవుళ్ళని నమ్ముకున్నాడు. వాళ్ళ నగల్ని అమ్ముకున్నాడు. తోటలూ, దొడ్లూ అమ్ముకున్నాడు. ఆఖరికి ఈ తోట, ఆ పొలం, ఆ వామిదొడ్డి, ఆ ఇల్లు మిగిలాయి. వాటిలో కొంతయినా అమ్మితే తన అప్పు తీరదేమో! తన మూర్ఖత్వం, అలౌకిక ఆఖరికి ఏమీ మిగలకుండా చేశాయి.

తోట గేటు తీసుకుని లోపల ప్రవేశించాడు.

మాలి ఎక్కడ? తాళం వెయ్యలేదేం? వూళ్ళోకి వెళ్ళాడా హుఁ యజమానికి శ్రద్ధ లేకపోతే పని మనిషికి కూలీ మనిషికి శ్రద్ధ, జాగ్రత్త ఎలా వస్తాయి?

ఈ ఆఖరు క్షణాల్లో ఇలా వచ్చే కన్నా ఇన్నేళ్ళు శ్రద్ధగా వచ్చి ఉంటే ఈ తోట ఆంయివేజు ఒక్కటే తను కుటుంబాన్ని సాకేది. మిగతా అంతా మిగిలి పోయేది.

వచ్చిందే చాలు అన్నట్టుగా తను గడిపాడు. అంతా భోగలాలస అనుకుంటారు. కానీ, తను ఎంత వేదాంతో ఎవరికి తెలుసు తన మనసెప్పుడూ ఆ ఏకాంతంలో, ఆ యోగ సాధనలో గడిపేది.

పార్వతి వచ్చి తపోభంగం చేసేది.

అప్పుడు తన మనస్సు ఆమె చుట్టూ తిరిగేది. ఇంట్లో పాపో, బాబో దోగాడటం మొదలుపెట్టే దాకా తిరిగి తన మనస్సు యోగం వైపు మళ్ళేది కాదు. తిరిగి కొన్నేళ్ళు ఆ తపస్సు. పిల్లలు నడవటం ప్రారంభిస్తే తనకి మళ్ళీ తపోభంగం.




ఒక్కసారిగా గాలి వీచింది. నారింజ పూతతో ఉంది కాబోలు ఘ్రాణేంద్రియం తర్పణ మయ్యే ట్టుగా పరిమళాల జల్లులు ప్రవహించాయి.

ప్రతి చెట్టునీ ముట్టుకున్నట్టుగా రాసుకుంటూ వడిచినట్టుగా తిరిగాడు. ఒక చోట మల్లెలన్నీ కుప్ప పోసినట్టుగా అనిపించింది. వెన్నముద్దలు! అవంటే పార్వతికి ఎంతో ఇష్టం. లాల్‌బాగ్ నుంచి తెప్పించాడు.

వంగి మట్టిని చేతిలోకి తీసుకున్నాడు. వాసన చూశాడు కమ్మని వాసన. ఈ నేలకి ఈ పరిమళం ఎక్కడిది?

ఈ భూమి పవిత్రమైంది, ఈ దేశం పునీత మైంది. ఈ గంగ ఉత్కృష్టమైంది, ఈ గాలి దివ్యమైంది! ఈ వెలుతురు తేజస్వంతమైంది.

ఎక్కడుంది ఇలాటి నేల?

ఈ ప్రపంచంలోనే లేదు. అందునా ఆంధ్ర దేశం వంటి దేశం లేదు. తెలుగు భాష వంటి భాష మన జాతి వంటి జాతి, మన మనస్సుల వంటి మనస్సు ఎక్కడున్నాయి.

మట్టిని కొద్దిగా నోట్లో వేసుకున్నాడు. తీయగా అనిపించింది. మామిడిపళ్ళకి తీయదనాన్ని, నారింజలకి రుచిని ఈ మట్టే ఇస్తూంది కాబోలు'.

అక్కడినుంచి బావి వద్దకు నడిచాడు. మెట్ల వెంట నడిచి దోసిళ్ళతో తాగాడు. కడుపు నిండింది. నిన్నటినుంచి భోజనం లేకపోవటం, విపరీతంగా పొగ పీల్చటం, కాఫీలు తాగటంతో అన్ని నీళ్ళు తాగగానే కడుపులో దేవినట్లయింది.

ఎవరు తవ్వించారో ఈబావి! ఏసుముహూర్తంలో ఎవరు తొలిసారిగా పలుగు వేశారు! అవెంత అమృత హస్తాలు.

చాలు!

ఈ వాసనలు పీల్చి, ఈ నీరు తాగి తన మనస్సు తృప్తి పడింది. ఇహ ఆఖరి వందనం చెప్పెయ్యొచ్చు.

నీళ్ళు తళతళ లాడుతున్నాయి చుక్కల వెలుగులో.

నిశ్చలంగా ఉన్నాయి.

తను దూకితే—

ఒక్క మట్టి బెడ్డ పడితేనే నీరంతా కదిలి పోతుంది. ప్రశాంతత భగ్నమైనట్టుగా పొరలు పొరలుగా, తెరలు తెరలుగ, అలలు అలలుగా పగిలి పోతుంది నీరు.

అలాంటిది తను దూకితే శతద్రూ నదిలా ఈ బావి పాయలై చీలి పోతుందా? తన చావుకి ద్రవిస్తుందా? గొల్లుని ఘోషిస్తుందా?

వూహూ వద్దు. ఏ పుణ్యాత్ముడు తవ్విస్తే, తాను ఈ చల్లని నీటిలో చల్లగా, శాశ్వతంగా శయనించాలనుకోవటం అన్యాయం? తనెక్కడ శయనించగలడు. ఈ జీవోత్క్రమణ జరగ్గానే ఈ శరీరం పైకి తేలుతుంది. జలచరాలుతినటం మొదలు పెడతాయి. ఈ లోగా మాలి కనుక్కుంటే పోలీసులు కేసు, పోస్టు మార్టం...వద్దొద్దు.

మెల్లిగా మెట్లెక్కి వచ్చాడు పైకి.

పవర్ హవున్ వద్దకి వెళ్ళేడు. బావికి ఇంజిన్ పెట్టించింది. తనే దానికో రూం కట్టాడు.

అక్క డెవరూ లేరు. అదృష్టం.

ఆలోచించలేదు. ఆహ ఆగదలుచుకోలేదు.

మెయిన్ ఆన్ చేశాడు. విద్యుత్ పూర్తిగా ప్రవహిస్తూం దిప్పుడు. ప్లగ్ తీశాడు. ముట్టు కున్నాడు.

''అమ్మా!''

కొన్ని సంవత్సరాల కిందట తొలిసారిగా భూమ్మీద పడినప్పుడు పెట్టిన కేకలాంటి కేక— ఆర్తనాదం గుండె తొలిచేసేటంత దుఃఖకరమైన కేక! అతని ప్రాణవాయువులు ఎగిరిపోయాయి.

● ● ● ●

రంగయ్య ఆశించినట్టుగానే ఆ రోజుకి వేలం ఆగిపోయింది. లాటరీలో లక్ష తగిలి కాదు. కొడుకు అమెరికన్ డాలర్లు పంపటం వల్ల కాదు. అల్లుడు పెట్రో డాలర్లు వెదజల్లటం వల్ల కాదు మరెందు వల్లా కాదు. అతని ఆత్మహత్య వల్ల — అకాల మృత్యువుకి సంతాప సూచకంగా వేలం ఆగిపోయింది కాదు—వాయిదా పడింది. *